



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 01-06-2024 సంపుటి : 06 సంచిక : 260 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్



అమరావతి,మే31 ( విభారె) : కౌంట్‌డౌన్ మొదలయ్యింది. 4న ఫలితాల లెక్కింపుపైనే ప్రజలంతా ఆసక్తిగా ఉన్నారు. రాజకీయా నాయకులు మాత్రం నరాలు తెగే ఉత్కంఠలో ఉన్నారు. యావత్తు దేశం ఏపీ ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తోంది. గతంలో ఎన్నడూ లేనంత ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఓట్ల లెక్కింపు జూన్ 4న మొదలుకానుంది. ఇప్పటికే ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఓట్లలెక్కింపు ఎలా సాగుతుంది. ఏయే ఫలితాలు ఎప్పుడొస్తాయన్నది ఆసక్తిగా మారింది. గతంలో ఎప్పుడూ లేనంతగా పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకే అనుకూలమని నిర్ణయించుకున్నారు. సిఎంజగన్ మరోమారు అధికారం చేపడతారని, 9న విశాఖలో ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రకటించారు. ఈ క్రమంలో ఇటీవలి ఎన్నికల హింస నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఓట్ల లెక్కింపు పక్రియ జూన్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఉదయం 4 గంటలకల్లా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 5 గంటలకు వారికి ఏయే టేబుళ్లు కేటాయించారన్న సమాచారం అందిస్తారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుండగా.... తొలుత ఆర్మీ సర్వీస్ ఉద్యోగుల ఓట్లు ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

**ఫలితాల కోసం భారీగా ఏర్పాట్లు**
**ఆసక్తిగా ఎదురు చూస్తున్న జనాలు**
**నరాలు తెగే ఉత్కంఠలో పోటీచేసిన నేతలు**
**తొలుత కొవ్వూరు..తరవాత నరసాపురం ఫలితం**

లెక్కించనున్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి అరగంట సమయం పట్టనుంది. ఆ తర్వాత ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ను తెరిచి ఓట్లు లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లను సిద్ధం చేశారు. పోలింగ్ బూత్ సీరియల్ నెంబర్ల ఆధారంగా వరుస క్రమంలో ఈవీఎంలు తెరిచి ఓట్లు లెక్కించనున్నారు. అంటే 14 టేబుళ్లపై తొలుత 1 నుంచి 14 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలు తెచ్చి పెట్టనున్నారు. అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలో వాటిని తెరిచి లెక్కించనున్నారు. దీంతో తొలి రౌండ్ పూర్తవుతుంద న్నమాట...తర్వాత రెండో రౌండ్‌లో 15 నుంచి 29 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలు తెచ్చి పెట్టనున్నారు.ఈ విధంగా ఒక్కో రౌండ్ పూర్తి చేసుకుంటూ వెళ్లనున్నారు. ఏదైనా ఈవీఎంలో సమస్య తలెత్తినప్పుడు ఆ పోలింగ్ బూత్ ఈవీఎం పక్కనపెట్టి ఆ తర్వాత వరుస సంఖ్యలో ఉన్న బూత్ నుంచి లెక్కించుకుంటూ వెళ్తారు. పక్కన పెట్టేసిన ఈవీఎంను చివరిలో మరోసారి చెక్ చేయనున్నారు. అప్పటికీ వీలుకాకుంటే ఆ పోలింగ్ బూత్‌లోని వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించి వాటినే ఓట్లుగా పరిగణించనున్నారు. అలాగే ఈవీఎంల లెక్కింపు పూర్తయినాతుది ఫలితాలు ప్రకటించరు. పోలింగ్ బూత్‌ల సీరియల్ నెంబర్లన్నీ చిట్‌లపై రాసి ఓ బాక్స్‌లో వేయనున్నారు. లాటరీ ద్వారా ఐదు పోలింగ్ కేంద్రాలను ఎన్నుకుని వాటి వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించనున్నారు.

# నేడు చివరిదశ లోక్‌సభ ఎన్నికలు

**ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు పోలింగ్**
**వారణాసి నుంచి ప్రధాని మోడీ పోటీ**
**హిమచల్ నుంచి నటి కంగనా రనౌత్**



న్యూఢిల్లీ,మే31( విభారె) : లోక్‌సభ తుదిదశ ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. దాదాపు 904 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. వారణాసి నుంచి ఆయన మూడోసారి పోటీ చేస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు ఈ ఏడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ మూడో సారి వారణాసి నుంచి పోటీ చేస్తున్నారు.పంజాబ్ లోని మొత్తం 13 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్ లో నాలుగు స్థానాలకు, ఉత్తర్ ప్రదేశ్ లోని 13 నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ లోని తొమ్మిది స్థానా లకు, బీహార్ లోని ఎనిమిది స్థానా లకు, ఒడిశాలోని ఆరు స్థానాలకు, ఝార్ఖండ్ లోని మూడు సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈసారి పోటీలో ఉన్న ప్రముఖులలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, లాలూ ప్రసాద్ కూతురు మిసా భారతి, నటి కంగనా రనౌత్ ఉన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనున్నది.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం టెలివిజన్ ఛానల్స్, వార్తా సంస్థలు జూన్ 1న సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్ డేటాను ప్రదర్శించుకోవచ్చు. దీంతో ఇప్పటికే డేటాతో సిద్దంగా ఉన్న వలు పోల్స్‌ను ప్రదర్శించేందుకు సిద్దంగా ఉన్నాయి.

## సజ్జల వ్యాఖ్యలపై టిడిపి సీరియస్

**ఫిర్యాదు చేయడంతో పోలీసుల కేసు నమోదు**

అమరావతి,మే31 ( విభారె) వైకాపా ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పై క్రిమినల్ కేసు నమోదైంది. కౌంటింగ్ ఏజెంట్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో తెదేపా నేతలు దేవినేని ఉమా, గూడపాటి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఆయనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. 153, 505, 125 సెక్షన్ల కింద సజ్జలపై కేసు పెట్టారు. వైకాపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ చీఫ్ కౌంటింగ్ ఏజెంట్ల అవగాహన సదస్సులో సజ్జల పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'మన రైట్ ఇదీ అని దృష్టిలో పెట్టుకుని... దానికి అవసరమైనవి తెలుసుకోవాలి. అవతలివారు అడ్డం పడకుండా వారిని ఆపేందుకు ఏవేం నిబంధనలు ఉన్నాయో చూసుకోవాలి. మనవి ఒక్క ఓటు కూడా చెల్లనివిగా చేసే పరిస్థితి రాకుండా అడ్డుకునేందుకు ఏం చేయాలో చూసుకోవాలి. అంతే తప్ప రూల్ అలా ఉంది కాబట్టి దాని ప్రకారం పోదాం అని మనం కూర్చోకూడదు. మనకు అనుకూలంగా, అవతలివాళ్ల ఆటలు సాగకుండా రూల్‌ని ఎలా చూసుకోవాలి? అవసరమైతే దానికోసం ఎంతవరకు ÷ట్ చేయాలనేది నేర్చుకుందాం. ఇందులో కౌంటింగ్ ఏజెంట్ తనవంతు పాత్ర పోషించేలా వారి మెదడులోకి మీరు (చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు) బాగా ఎక్కించాలి. పొరపాటున ఒకటి మనం వాదించినా పర్లేదు. కానీ, రూల్ కాదేమో అని వెనక్కి తగ్గేవాడైతే ఏజెంట్‌గా వద్దు' అని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.

## శ్రీవారిని దర్శించుకున్న అమిత్ షా దంపతులు

తిరుమల,మే31: మరో నాలుగు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలోనే రాజకీయ ప్రముఖులంతా దైవ దర్శనం చేసుకుంటున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. తన సతీమణి సోనాల్ షాతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. మహాద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించిన అమిత్ షా దంపతులు.. శ్రీవారి అభిషేకసేవలో పాల్గొన్నారు. అమిత్ షా దంపతులకు ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గత కొద్ది రోజులుగా అమిత్ షా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కశ్మీర్ నుంచి తమిళనాడు వరకూ పర్యటించిన ఆయన ఎన్నికల ప్రచారం ముగియడంతో తిరుమల శ్రీవారి సన్నిధిలో గడపాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల తుది విడత ప్రచారం ముగియడంతో గురువారం సాయంత్రం 6.15 గంటలకు అమిత్ షా దంపతులు రేణిగుంటకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమలకు చేరుకున్నారు.



రాత్రికి బస చేశారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం తిరుమల నుంచి తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు.

# అన్యాయాలపై పోరాటం చేస్తూనే ఉంటా



అమరావతి,మే31 ( విభారె) సీనియర్ ఐపిఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పదవీ విరమణ చేశారు. ఆయన పదవీ విరమణ చేసేందుకు రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఉదయమే ఆయనకు పోస్టింగ్ తీసుకుని జాయిన్ అయ్యారు. సాయంత్రం పదవీ విరమణకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయనను విధుల్లోకి తిరిగి చేర్చిన ప్రభుత్వం.. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని హోం సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చారు

**విధి నిర్వహణలో ఎక్కడా తప్పు చేయలేదు**
**ఐపిఎస్ కాకుండా ఉంటే..జీవితం మరోలా ఉండేది**
**పదవీవిరమణ సందర్భంగా ఎబివి వ్యాఖ్యలు**

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. ఈ మేరకు జీఏడీ నుంచి జీవో నెంబర్ 1013ను ప్రభుత్వం జారీ చేసింది. కొన్నేళ్లుగా ప్రభుత్వంపై న్యాయపరంగా పోరాడిన ఏబీ వెంకటేశ్వరరావు.. రిటైర్ అవ్వాల్సిన రోజున విధుల్లో చేరారు. ఉదయం బాధ్యతలు చేపట్టిన ఆయన సాయంత్రం పదవీ విరమణ చేశారు. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. విజయవాడ ముత్యాలంపాడులోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కార్యాలయంలో పదవీ విరమణ చేశారు ఏబీ వెంకటేశ్వరరావు. పోలీసు శాఖ పరంగా డీజీలో హోదాలో ఉన్నారు ఏబీవీ. కాగా, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు.. ఏబీవీని కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏబీవీని ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. వీరిద్దరూ ఒకే బ్యాచ్‌మేట్స్ కావడంతో పరస్పరం క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎబివి మాట్లాడుతూ..తాను పోలీస్ ఉద్యోగంలోకి రాకుండా ఉంటే తన జీవితం మరోలా ఉండేదన్నారు. తాను ఇంజినీరింగ్ చదువుకుని తొలుత టాటామోటార్స్‌లో ఉద్యోగం చేశాను. అదే సంస్థలోలో ఉన్నా.. లేక అమెరికా వెళ్లినా.. ఇప్పుడు నా జీవితం వేరే విధంగా ఉండేది. ఐపీఎస్‌గా అధర్మాన్ని, అన్యాయాన్ని, అణచివేతను ఎదుర్కోవడం నా వృత్తిధర్మంగా పనిచేశాను. నా సర్వీసులో చట్టాన్ని కాపాడేండేందుకు అక్రమాలను, అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు పాటుపడ్డాను. అన్యాయాన్ని ఎదుర్కొన్నా తప్పితే నేను ఎవరికీ అన్యాయం చేయలేదు. నేను ఈ రోజు పూర్తి సంతృప్తితో రిటైర్ అవుతున్నాను. నా సర్వీసులో నీతి నిజాయితీతో వ్యవహరించాను. ఎవరికీ అన్యాయం చేయకపోవడంతోనే ఈరోజు నేను లక్షల మంది అభిమానం పొందాను. నాకు ఎదురైన సవాళ్లు, కష్టాలు చూసి నా అభిమానులు ఉద్వేగ్వంతో ఏడ్చారు. నా నిజాయితీ, ధర్మం, పోరాటమే నన్ను కాపాడింది. నా సర్వీసులో దుర్మార్గులనూ చూశా.. నాకు వ్యతిరేకంగా వ్యవహరించాలని కొందరు ఎంత డబ్బు ఇచ్చినా కొందరు అంగీకరించలేదు. నాకు అండగా నిలిచిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు. రిటైర్ అయినా నా జీవితం ఉన్నంతవరకు ప్రజా సేవలో ఉంటాను. నా శేష జీవితంలోనూ అన్యాయాన్ని, అణచివేతను ఎదురిస్తా. దుష్ట శిక్షణ–శిష్టరక్షణ చేసేందుకు నా రిటైర్డ్ జీవితంలో అవకాశం వస్తుందని ఆశిస్తున్నా. నాకు అప్తులుగా ఉండి అండగా ఉన్న వారికి రుణపడి ఉంటా' అని అన్నారు.

# ఐదేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం

అమరావతి,మే31( విభారె) ఎట్టకేలకు ఐదేళ్ల వేధింపుల తరవాత..సీనియర్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావుకు ఏపీ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా ఆయనను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్ట్ ఉత్తర్వులు మేరకు శుక్రవారం ఉదయం వెంకటేశ్వర రావుపై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు మొదటిసారి సస్పెన్షన్ ఎత్తివేసి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అప్పుడు కూడా ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా పోస్టింగ్ ఇచ్చింది. మళ్ళీ ఇప్పుడు కూడా అదే పోస్టింగ్ ఇచ్చింది.ఈ క్రమంలో ఏబీ వెంకటేశ్వరరావు ఛార్జ్ తీసుకున్నారు. తిరిగి సాయంత్రం పదవీ విరమణ చేయనున్నారు. ఐదేళ్ల క్రితం జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చీ

**సీనియర్ ఐపిఎస్ ఎబివికి ఎట్టకేలకు పోస్టింగ్**
**ఉదయం జాయినింగ్..సాయంత్రం రిటైర్‌మెంట్**

రాగానే.. ఏబీ వెంకటేశ్వరరావుపై ప్రభుత్వం కక్ష గట్టింది. ఆ వెంటనే ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. అప్పుడు వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తి వేయాలంటే ఏపీ ప్రభుత్వానికి క్యాట్ సూచించింది. దీనిపై జగన్ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అయితే క్యాట్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోబోమని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అలా ఐదేళ్లుగా ఏబీ వెంకటేశ్వరరావు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. ఆయన పోరాటం ఫలించి.. పదవీ విరమణ రోజు విధుల్లో చేరారు. ఈ క్రమంలో జగన్ జగన్ సర్కార్ అనుకున్న విధంగానే ఐదేళ్లు ఆయనను అధికారానికి దూరంగా ఉంచారు. చివరకు పదవీవిరమణ రోజు హైకోర్టులో కూడా వ్యతిరేకంగా నిర్ణయం రావడంతో సర్వీసులోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఏబీవీపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఇటీవల కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఎత్తివేసింది. దీనిని హైకోర్టు కూడా సమర్థించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను సర్వీసులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమిషనర్ ఆయనకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రక్షణ పరికరాల కొనుగోలు వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో వైకాపా ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసింది. డైరెక్టర్ జనరల్ ర్యాంక్ కలిగిన ఆయనకు ఐదేళ్లుగా పోస్టింగ్ ఇవ్వకుండా సస్పెన్షన్ల మీద సస్పెన్షన్లు విధించింది.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరాలు వెల్లడించాలి: గవర్నర్‌ను కలిసిన భాజపా బృందం

విజయవాడ మే31( విభారె) : భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో 11 మంది నేతల బృందం శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కలిసింది. 13 అంశాలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆర్‌బీఐ జాబితా ప్రకారం తెచ్చిన మొత్తం అప్పులు, గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలు, రాష్ట్ర ప్రభుత్వం తాకట్టు పెట్టిన ఆస్తుల వివరాలు ప్రకటించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.గవర్నర్‌తో భేటీ అనంతరం పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. "వైకాపా ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అడ్డగోలుగా అప్పులు తెచ్చింది. గ్రామాల్లో పనులు చేసిన సర్పంచ్‌లు, గుత్తేదారులకు బిల్లులు కూడా ఇవ్వలేదు. కేంద్రం గ్రామీణాభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించారు. మద్యంపై భవిష్యత్‌లో వచ్చే ఆదాయాన్ని కూడా చూపి అప్పులు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ అడిగే హక్కు గవర్నర్‌కు ఉంది. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుల వివరాలు కావాలని కోరాం. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా నచ్చిన వచ్చిన వారికి ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లించారు" అని పురందేశ్వరి ఆరోపించారు.



# సంపాదకీయం

శనివారం 01-06-2024

## ఉచిత హామీలు...అవినీతేనా

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో చేసే వాగ్దానాలు అవినీతి కిందకు రావని సుప్రీంకోర్టుపేర్కొంది. ఎన్నికల చట్టాలప్రకారం మేనిఫెస్టోలోని పథకాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఆర్థిక సహాయం చేసినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎన్నికల వేళ మేనిఫెస్టో ప్రకటించడం అవినీతి చేయడంతో సమానమని పిటిషనర్ చేసిన వాదనను తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ వీకే విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ వాదన విచిత్రంగా ఉందని అభిప్రాయపడింది. తగిన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది. కర్ణాటకలో గతేడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. చామరాజనగర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీజెడ్ జమీర్ అహ్మద్‌ఖాన్ గెలుపొందారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో అనేక హామీలు ప్రకటించింది. దీనిపై శశాంకం జె శ్రీధర అనే వ్యక్తి స్థానిక హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు అవినీతి కిందకే వస్తాయని పిటిషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన జమీర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ శశాంక శ్రీధర్ హైకోర్టును ఆశ్రయించారు.రాజకీయ పార్టీలు అధికారం చేపట్టేందుకు అలవిగాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. వీటి కారణంగా ప్రజలు ప్రలోభాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇష్టారీతిన మేనిఫెస్టోలు, హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరిస్తున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కారణంగా రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కూడా అవినీతికి కిందకే వస్తాయని, వీటిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.జరిపిన కర్ణాటక హైకోర్టు పిటిషనర్ వాదనలను తోసిపుచ్చింది. తాము అమలు చేయాలనుకుంటున్న విధానాల గురించి ఏదైనా పార్టీ ప్రకటించడాన్ని అవినీతిగా పరిగణించలేమని పేర్కొంది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 కింద మేనిఫెస్టోను అవినీతిగా పరిగణించలేమని తెలిపింది. వాటిని సంక్షేమ విధానాలుగానే చూడాలని, ఆర్థికపరంగా అవి సరైనవేనా కాదా అనేది వేరే విషయమని అభిప్రాయపడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో శశాంక దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కర్ణాటక హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం పార్టీల మేనిఫెస్టోల్లోని హామీలను ప్రజలు నమ్మితే ఎవరేం చేస్తారని ప్రశ్నించింది. మేనిఫెస్టోను అవినీతిగా పరిగణించలేమని పిల్‌ను తోసిపుచ్చింది.ఎన్నికల సమయంలో పార్టీ ప్రణాళికలను విడుదల చేయడం చట్టబద్ధమైనప్పటికీ వాటి అమలుకు నైతిక బాధ్యత వహించవలసిన అవసరం పార్టీలకు ఉండడం లేదు. అలవికాని హామీలు ఇవ్వడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం, గెలిచాక నిలబెట్టుకోలేక పోవడం రివాజుగా మారింది. తమిళనాడులో ఉచిత చీరలు, ప్రెషర్ కుక్కర్లు, వాషింగ్ మిషన్లు, టెలివిజన్లతో ప్రారంభమైన 'రేవిడీ సంస్కృతి' నేడు దేశం అంతా విస్తరించింది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు ఉచిత వాగ్దానాలకు బాగా అలవాటు పడ్డాయి. ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్లు, టికెట్ లేని బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, రుణమాఫీ, స్కూటీలు, లాప్టాప్ లు, తాళిబొట్లు, పెళ్లికి సహాయం, తదితర పేర్లతో ఓటర్లను ప్రలోభపెడుతున్న పార్టీలు ఆర్థికవ్యవస్థను అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. రాజకీయ పార్టీలు నేడు ఉచితాలకు సంక్షేమ పథకాలకు మధ్య విభజన రేఖను చెరిపివేస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి ప్రజలకు రోజువారి కనీస సదుపాయాలు రాయితీ ధరతో సులభంగా పొందేందుకు ఇచ్చే సంక్షేమ పథకాలను, ఎలాంటి హేతుబద్ధత లేకుండా విలాసాలను కూడా అవసరాలుగా భ్రమింపజేస్తూ ఉచితంగా ఇస్తూ అవి సంక్షేమ పథకాలుగా పార్టీలు చెబుతున్నాయి. అధికారమే పరమావధిగా సరికొత్త ఉచిత హామీలు ఇవ్వడంలో పార్టీలు తమలో తామే పోటీపడుతున్నాయి. ఉచితాలు నిష్పక్షపాత ఎన్నికలు అనే భావనకు విఘాతంగా మారుతున్నాయి. ప్రజల డబ్బుని ఎగురవేసి ఓట్లు సంపాదించే మార్గాలుగా పార్టీలు ఉచితాలను తీర్చిదిద్దుతున్నాయి. ఉచిత విద్యుత్తు, ఉచిత రవాణా లాంటి దారి తెన్నులేని, ప్రణాళిక లేని పథకాలు ఆయా సంస్థలను నిర్వీర్యం చేసి మొత్తంగా మూసివేతకు దారి తీయవచ్చు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు రుణ భారం పెరిగి ప్రాధాన్య రంగాలపై తగిన నిధులను వెచ్చించలేకపోతున్నాయి. బడ్జెట్ పై ఒత్తిడి పెరగటం, విద్య, ఆరోగ్య రంగాలకు నిధుల కొరత, దేశ స్థూల ఉత్పత్తి సామర్థ్యం, ఆర్థిక సమతుల్యం దెబ్బ తినటం, వాంఛనీయం కాని వస్తు సేవల వినియోగం పెరగటం, వంటి నష్టాలు కలుగుతాయి. సంక్షేమం పేరుతో బడ్జెట్ లో సింహం భాగం ఖర్చు చేయడం వల్ల సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆధునికీకరణ జరగకపోవడం, సమాజం వెనుకబాటుకు గురికావడం జరుగుతుంది. ఉచితాలపై కమిటీ వేయాలి మేనిఫెస్టోలోని హామీలతో వనరుల వివరాల సమర్పణ తప్పనిసరి చేయడమే గాక, అమలు చేయని పార్టీల గుర్తింపును రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. ఉచితానుచితాలను నిర్ణయించేలా, ఉచితాలకు సంక్షేమ పథకాలకు మధ్య విభజన రేఖను గుర్తించేందుకు నిపుణుల కమిటీని నియమించాలి. రుణ భారం పెంచే ఆర్థికవృద్ధిని నష్టపరిచే ఉచితాలను రద్దు చేయాలి. ఈసీ అధికారాలపై గల పరిమితులను తొలగించాలి. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు వరంగా మారాలి గానీ, పార్టీలకు ఓట్ల వరంగా మారకుండా చూడాలి. రాజకీయ పార్టీల భవిష్యత్తును, అధికారాన్ని నిర్ణయిస్తున్న ఈ ఉచితాల వల్ల సానుకూల, వ్యతిరేక ఫలితాలు కలుగుతున్నాయి. సరైన ప్రణాళికతో ఉత్పాదకతను పెంచేలా పథకాలు ఉంటే ఆర్థిక అభివృద్ధికి దోహదకారి అవుతాయి. ఎంపిక చేసిన వస్తు సేవల ఉత్పత్తి పెరగటం, ఆదాయ అసమానతలు తగ్గటం, దీర్ఘకాలికంగా శ్రామిక శక్తి ఉత్పాదకత పెరగటం జరుగుతుంది.

# ఎలక్ట్రానిక్ ట్రాన్స్ఫర్ పోస్టల్ బ్యాలెట్ పత్రాలను జాగ్రత్తగా లెక్క కట్టండి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 31–ఈ నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం పాణ్యం మండలం నెరవాడ గ్రామ సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు విధానంపై ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్వైజర్లకు కౌంటింగ్ అసిస్టెంట్ లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ను చక్కగా నిర్వహించాలని, వాటి లెక్కింపుకు సంబందించి ప్రత్యేకంగా టేబుళ్లను, స్కానర్లను ఏర్పాటు చేయించారు. సర్వీసు ఓటర్లు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఏ విధంగా లెక్కిస్తారనే విధానంపై ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్వైజర్లకు కౌంటింగ్ అసిస్టెంట్లకు డెమో వెబ్సైట్ నందు ప్రాక్టీస్ చేయించడం జరిగింది ., పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఏకకాలంలో జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ముందుగా ఫారం 13సీలోని కవర్ తెరచి, కవరు బయట ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఒకదాని తర్వాత ఒకటి లెక్కించాలన్నారు. క్యూఆర్ కోడ్ చెకింగ్ వల్ల ఎటువంటి డూప్లికేట్ ఓట్లకు అవకాశం ఉండదన్నారు. మొదటిది ఫామ్ 13 సీబయటకు కవరు, రెండవది ఫారం 13ఏ ఓటరు డిక్లరేషన్ ఫామ్, మూడవది పోస్టల్ బ్యాలెట్ ఉన్న ఫారం 13బి కవరు ను వరుస క్రమంలో స్కాన్ చేస్తారు. కవరు-13సిలో ఉన్న పోస్టల్ బ్యాలెట్ పేపర్ ను తెరువబోయే ముందు రిటర్నింగ్ అధికారి 13ఏ (ఓటర్ డిక్లరేషన్ ఫారం) సరిచూసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పరిశీలన ఫారం 13 ఏ డిక్లరేషన్ లో అన్ని అంశాలు సరిగా ఉన్నట్లయితే, ఫారం 13బీ పోస్టల్ బ్యాలెట్ కలిగివున్న కవరు ను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు.

# స్వాతంత్ర్య సమరయోధులను అనుక్షణం స్మరించుకోవాలి...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:–మే 31 స్వాతంత్ర్య సమర యోధురాలు దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి సందర్భంగా డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తొలి ఆంధ్ర మహిళ దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని కోరారుదేశ బాంధవి దువ్వూరి సుబ్బమ్మ 1880 లో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన మొట్టమెదటి ఆంధ్ర మహిళ. సమాజసేవిక, స్త్రీ జనోద్ధరణకు కృషి చేసిన మహనీయురాలు. ఈమె స్వాతంత్ర్యోద్యం వైపు అడుగులు వేసి కాకినాడలో జరిగిన రాజకీయ సమావేశంలో పాల్గొని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని లక్ష్యంగా బలపరుస్తూ అనర్గళంగా మాట్లాడింది. ఈమె 1922 సంవత్సరంలో సహాయనిరాకరణోద్యమంలో ప్రముఖ పాత్ర వహించింది. అంతే కాకుండా ఈమె ఉప్పు సత్యాగ్రహం, క్విట్ఇండియా ఉద్యమాలలో పాల్గొన్నది. 1964 సంవత్సరం మే 31 తేదీన ఈమె పరమపదించింది. ఇలాంటి మహనీయులను స్మరించు కుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని ఆయన కోరారు.

# జూన్ నెలలో ఉచితంగా 3కేజీలు జొన్నలు. రాగులు

### జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 31–. నంద్యాల్ జిల్లా లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులందరికీ ఉచితముగా బియ్యం మరియు సబ్సిడీ ధరపై చక్కెర ప్రతి మాసము ఎమ్ డీ యు వాహనాల ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుచున్నదని జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు . మార్చి నెల నుండి బియ్యం బదులు 3 కిలో ల వరకు జొన్నలు ఉచితంగాను రైస్ కార్డు దారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు .మే మాసంలో 533.182 మెట్రిక్ టన్నుల జొన్నలను 2,05,839 మంది కార్డు దారులు బియ్యం కు బదులుగా 3 కిలో ల జొన్నలను పంపిణీ చేశారని తెలిపారు .అదేవి దంగా జూన్ నెల 1 వతేది నుండి కూడా చౌక ధరల దుకాణం నుండి ఎమ్ డీ యు వాహనాల ద్వారా జిల్లా లోని కార్డు దారులందరికి 3 కేజీలు చొప్పున జొన్నలు మరియు రాగులు ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు .కావున, కార్డుదారులందరూ ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి తెలియజేశారు .

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 31– నంద్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పొగాకు ఒక వినియోగంలో స్వల్పంగా తగ్గుదల ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరం టొబాకో పదార్థాల వలన మరణాల రేటు పెరుగుతూ ఉందని అన్నారు. పొగాకు పదార్థాలను వాడటం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ గొంతు క్యాన్సర్ పక్షవాతము మరియు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తెలియజేశారు. ధూమపానం వలన మానసిక ఆరోగ్య రుగ్మతలను కలగజేస్తాయని ఆందోళన నిరాశ బైపాలర్ డిజార్డర్ లాంటివి దరిచేరుతాయని అన్నారు . ముఖ్యంగా జూన్ 5వ తేదీ తర్వాత నుండి పొగాకు రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం ప్రజలు మరియు రోగుల కోసం ప్రతిజ్ఞ కార్యక్రమాలను 20 రోజులపాటు నిర్వహించడం ఆన్లైన్లో ప్రతిజ్ఞ చేసి పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తామని తెలియజేశారుఈ కార్యక్రమంలో డి ఎల్ ఓ డాక్టర్ శారద భాయ్, ఎన్ సి డి జిల్లా కార్యక్రమా నిర్వహణ అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ మరియు ఎన్ హెచ్ నిర్వహణ అధికారి డాక్టర్ సునీత, డిస్ట్రిక్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్నలక్ష్మి, ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.




# ఇంజీనియస్ చాంప్ వరల్డ్ రికార్డులో డోన్ విద్యార్థి ప్రతిభ....



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:–మే 31 ఇంజీనియస్ చాంప్ వరల్డ్ రికార్డులో డోన్ పట్టణ నివాసి కొండెపోగు ఇసాకు ఎస్తేరు రాణి ల మొదటి కుమారుడు అయిన కొండేపోగు జోనాథన్ 14 సం.లు పట్టణంలోని సాంజో పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనపరుస్తూ అడ్యుడికేటార్ చేతులమీదుగా అవార్డును తీసుకున్నాడు. అలాగే ఎలక్ట్రానిక్ కీబోర్డ్ మ్యూజికల్ లో ఉత్తమ ప్రతిభ కనపరిచాడు. ఈ సందర్భంగా ఇంజీనియస్ చాంప్ వరల్డ్ రికార్డు వారి ఆధ్వర్యంలో హల్లెలూయ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు దండింగి అగస్టిన్ విద్యార్థులకు సంగీతం పట్ల మక్కువ పెంచి ఆనంద జీవితానికి మార్గాలను చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎడిటర్ ఆనంద్ జయరాజ్, బిందు ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సచివాలయంలో టీబీ వ్యాక్సిన్

### మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 31-క్షయవ్యాధి నివారణలో భాగంగా ప్రతి సచివాలయంలో బీసీజీ వ్యాక్సిన్ వేయనున్నట్లు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో. ప్రతి సచివాలయంలో ఆగస్టు 15 వరకు ప్రతి గురువారం వ్యాక్సిన్ వేస్తారన్నారు. ఐదేళ్ల కిందట టీబీ వచ్చి తగ్గిన వారికి, క్షయ రోగి కుటుంబ సభ్యులు, పొగ తాగే వారు, మధుమేహ రోగులు, బీఎంఐ 18 కన్నా తక్కువ ఉన్న వారు, 60 ఏళ్లు పైబడిన వయోజనులు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

# కూటమి అభ్యర్థి విజయం కోసం ప్రత్యేక పూజలు..

విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:–మే 31 డోన్ మండల పరిధిలోని ఆవుల దొడ్డి గ్రామంలో శనివారం ఉదయం గ్రామంలోనీ కొండలపై వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామిఆలయంనందు ఉదయం 6 గంటల నుండి 10 గంటల సమయం మధ్యలో జనసేన, తెలుగుదేశం,బిజెపి, పార్టీల కూటమి అభ్యర్థి అయిన కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి విజయం ప్రాప్తించాలని స్వామివారికి అమ్మవార్లకి అభిషేకం మరియు ప్రత్యేకమైన పూజలు నిర్వహించనున్నట్లు జనసేన నాయకులు కాలమోహన్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పూజా కార్యక్రమంలో ఉమ్మడి అభ్యర్థి సూర్య ప్రకాశ్ రెడ్డి ఉదయం 6 గంటలకే పూజా కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు హనుమాన్ జన్మదినం సందర్భంగా ఆవుల దొడ్డి కొండపైనే ఉన్న హనుమంతుడి పెద్ద విగ్రహా మూర్తికి అభిషేకం ఆకు పూజ నిర్వహించడం జరుగుతున్నది. కార్యక్రమం అనంతరం వచ్చిన భక్తాదుల అందరికీ టిఫిన్లు ఏర్పాటు చేయడంజరిగింది.కావున డోన్ నియోజకవర్గంలోని జనసేన నాయకులు జనసైనికులుటిడిపి నాయకులుకార్యకర్తలు బిజెపి నాయకులు,కార్యకర్తలు.. స్వచ్ఛమైన హృదయం కలిగి శ్రీ కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి విజయాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ కూడా ఆవులదొడ్డి గ్రామానికి విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొనీ జయ సూర్య ప్రకాష్ రెడ్డి విజయం కోసం ఆ భగవంతున్ని ప్రార్థించవలసిందిగా ఆయన కోరారు



# కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలి


## ప్రధాని మోదీ మాటలు అర్ధ రహితం



విభారే న్యూస్. మే 31 కర్నూల్ ప్రతినిది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి మాటలు అర్థరహితంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, కాంగ్రెస్ ఎసి సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, ఐ ఎన్ టి యు సి కార్యదర్శి ఆర్ ప్రతాప్ మొదలగువారు మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలోని దుమ్క జిల్లాలో ఎన్నికల బహిరంగ సభలో మోడీ గారు మాట్లాడుతూ ఆంగ్లేయులు పెట్టిన ఆదివారం సెలవు దినాన్ని మార్చే యోచనలో ఉన్నామని మాట్లాడటం అర్థరహితమని ఆదివారం సెలవు దినంగా ఉన్న రోజును శుక్రవారం కు మార్చడం మోడీ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని వందల ఏళ్లుగా ప్రపంచ దేశాలన్నీ ఆదివారం మాత్రమే సెలవుదినంగా పాటిస్తున్నారని దానిని ఎందుకు మారుస్తారో స్పష్టంగా తెలపాలని కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టే వ్యాఖ్యలు మోది చేస్తున్నారని అన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంగా ఉందని అలాంటి దేశంలో ఇలాంటి మాటలు మాట్లాడడం ప్రధానికి తగదన్నారు ప్రతిసారి మతపరమైన రెచ్చగొట్టే విధంగా ఆయన వ్యాఖ్యలు భారత దేశ పరువు తీసేలా ఉన్నాయని అన్నారు. మోదీ గారు ఆర్ఎస్ఎస్ భావజాలంతో మాట్లాడితే ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఓటమి భయంతో ఏవేవో పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని వారు తెలియజేశారు.

## ఉద్యోగ ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

### జూన్ 2 న ఎమ్మిగనూరు లో జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం




విభారే న్యూస్ ఎమ్మిగనూరు , మే 31 ... 2024 మే 13 న జరిగిన ఎన్నికల విధులకు హాజరుకాని ఉద్యోగ ఉపాధ్యాయుల సస్పెన్షన్ ను ఎత్తివేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) జిల్లా అధ్యక్షులు కరె కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోట్ల చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం స్థానిక డిటిఎఫ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని ఎలక్షన్స్ విధులు నిర్వహించిన పీఓ , ఏపిఓ, ఓపీఓ సిబ్బందికి ఆయా కాన్స్టిట్యూన్సీ రిటర్నింగ్ ఆఫీసర్స్ డ్యూటీ సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు. జూన్ 2 వ తేదీన డిటిఎఫ్ 17వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశము ఎమ్మిగనూరు పట్టణం లోని ప్రభుత్వ మోడల్ హై స్కూల్ లో జరుగుతున్నట్లు కృష్ణ తెలిపారు. ఈ సమావేశమునకు జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కౌన్సిలర్సు, మండల అధ్యక్ష కార్యదర్శులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు వెంకటేశప్ప జయానంద్ రవీంద్ర గుమ్మా శ్రీనివాసులు, రంగస్వామి శివశంకర్ పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

### ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 31- రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వారి ఉత్తర్వుల మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి పాణ్యం మండలం అర్జీ ఎమ్ ,శాంతిరామ్ ఇంజనీరింగ్,ఫార్మసీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్స్ చుట్టుపక్కల 2 కిలోమీటర్ల మేర రెడ్ జోన్ గా ప్రకటించారని తెలియజేశారు. ఈ ప్రకటన ద్వారా స్ట్రాంగ్ రూమ్ల చుట్టూ ఉన్న గగనతలంలో అనధికార డ్రోన్ కార్యకలాపాలను 2 కిలోమీటర్ల మేర నిషేధించడం జరిగిందని అన్నారు . ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ రెడ్ జోన్ నిబంధనలు వెంటనే అమలులోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించినారు. ఈ రెడ్ జోన్ నిబంధనలు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు అమలులో ఉంటాయని అన్నారు.



ఎవరైనా ఈ నిబంధనలు అతిక్రమించిన ఎడల వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**3న కౌంటింగ్ సిబ్బందికి కౌంటింగ్ కేంద్రంలో అవగాహన కల్పిస్తాం**
**మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి నిషేధం**
**జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన**







విభారే న్యూస్ కర్నూలు ప్రతినిధి మే, 31, కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్ కు ఇచ్చే రెండవ విడత శిక్షణ కార్యక్రమం రెండు సెషన్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 4వ తేదిన కౌంటింగ్ ప్రక్రియలో ఈవిఎం కౌంటింగ్ ఒకటి, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటాయన్నారు. జూన్ 2వ తేదిన ర్యాండమైజేషన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్, ఈవిఎంలు లెక్కింపు ఎవరు చేస్తారు అనేది తెలిసే అవకాశం ఉంటుందని జూన్ 3వ తేదిన కౌంటింగ్ సిబ్బంది మొత్తాన్ని రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకొని కౌంటింగ్ విధుల్లో నిర్వహించాల్సిన గదులను రిటర్నింగ్ అధికారులు చూపించడంతో పాటు అక్కడ ఏమైనా సందేహాలు ఉన్న నివృత్తి చేయడం జరుగుతుందని దీని ద్వారా 4వ తేది కౌంటింగ్ సిబ్బంది ఎటువంటి హడావిడి లేకుండా వారికి కేటాయించిన నియోజకవర్గాల కౌంటింగ్ హాల్ లలో విధులకు హాజరు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని ఒకవేళ తీసుకొని వస్తే డిపాజిట్ కౌంటర్లో డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, కేవలం అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు, ఈటిపిబిఎస్ రిటర్నింగ్ అధికారులకు మాత్రమే మొబైల్ ఫోన్ల అనుమతి ఉందని కౌంటింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది జూన్ 4వ తేదీ ఉ.5.గం.లకు కలెక్టరేట్ కు వస్తే వారిని బస్సుల ద్వారా కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. లా అండ్ ఆర్డర్ దృష్ట్యా సొంత వాహనాలలో వచ్చి ఇబ్బంది పడకూడదని కలెక్టర్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. ఈవిఎం కౌంటింగ్ సమయంలో సీల్స్ తొలగించేటప్పుడు అడ్రెస్ ట్యాగ్ దారం దగ్గర మాత్రమే కత్తిరించాలని, అదే విధంగా గ్రీన్ పేపర్ సీల్ మీద ఉన్న నెంబర్ కట్ చెయ్యకుండా జాగ్రత్తగా సీల్ తొలగించాలని, కౌంటింగ్ తరువాత మళ్లీ వాటితోనే సీల్ చేసే అవకాశం ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి తీసిన 17సి, కంట్రోల్ యూనిట్ మీద ఉన్న సీరియల్ నెంబర్ సరిచూసుకోవాలని, సదరు 17సి మాత్రమే ఫైనల్ గా పరిగణించబడుతుందన్నారు. కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్ ఆన్ చేసినప్పుడు డిస్ప్లే రాకపోతే ఆర్ఓకు సమాచారం ఇచ్చి ఆ రౌండ్ కు సదరు సిబ్బంది ఖాళీగా ఉంటారే తప్ప ఇంకొక మెషీన్ తెచ్చి కౌంట్ చేయడం జరగదన్నారు.. కౌంటింగ్ సమయంలో అభ్యర్థుల వారీగా ప్రతి రౌండ్ వారీగా పోల్ వివరాలను గట్టిగా ఏజెంట్లకు వినపడేలా చదవడంతో పాటు కార్బన్ పేపర్ తో కూడిన పేపర్ లో నోట్ చేసుకొని ఒక కాపీని టాబులేషన్ కు పంపుతారని ఇంకొక కాపీని మీ దగ్గరే ఉంచుకోవాలన్నారు. టాబులేషన్ కు పంపే క్రమంలో అందరూ ఏజెంట్లతో ఒరిజినల్, కార్బన్ కాపీ ల మీద సంతకం తప్పనిసరిగా తీసుకొని ఏజెంట్లకు జిరాక్స్ కాపీలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా అడ్రస్ ట్యాగ్ మీద ఉన్న సీరియల్ నెంబర్, కంట్రోల్ యూనిట్ మీద ఉన్న నెంబర్ ఒక్కటే అనే డిక్లరేషన్ చేతితో వ్రాసి ఏజెంట్లతో సంతకం తీసుకోవాలన్నారు. డిస్ప్లే లేని, ఇన్వాలిడ్ అని వచ్చిన ఈవిఎంలకు సంబంధించి వివిప్యాట్ స్లిప్స్ లెక్కించడం జరుగుతుందని, సదరు కౌంటింగ్ లో వివిప్యాట్ స్లిప్స్ మాత్రమే ఫైనల్ గా పరిగణించబడుతుందన్నారు. తదుపరి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలి అని మార్గదర్శక సూత్రాలను గురించి కలెక్టర్ వివరించారు. ఈవిఎం కౌంటింగ్ నిర్వహణపై ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ పై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి కౌంటింగ్ పై అవగాహన కల్పించారు. సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాణ్యం ఎన్నికల కౌంటింగ్ 26 రౌండ్లలో పూర్తి ఉదయం 8 నుండి పోస్టల్ బ్యాలెట్, 8.30 నుండి ఈవీఎంల కౌంటింగ్

**పాణ్యం నియోజకవర్గ ఆర్వో నారపురెడ్డి మౌర్య.**



విభారే న్యూస్ కర్నూలు మే 31,- సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ జూన్ 4 వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, ఉదయం 8.30 గంటల నుండి ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రారంభమవుతుందని పాణ్యం నియోజకవర్గ ఆర్వో నారపురెడ్డి మౌర్య పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా పాణ్యం ఆర్వో మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ రాయలసీమ యూనివర్సిటీలోని మొదటి అంతస్తు ఇంజనీరింగ్ బ్లాక్ లో నిర్వహించడం జరుగుతుందని పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కొరకు 14 టేబుల్స్ ని, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి దాదాపు 5700 పోస్టల్ బ్యాలెట్లను 6 టేబుల్స్ ద్వారా రెండు రౌండ్లలో లెక్కించడం జరుగుతుందని ప్రతి టేబుల్ కి ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి 26 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి కౌంటింగ్ పై ఇప్పటికే రెండు పర్యాయాలు శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందని కౌంటింగ్ సిబ్బంది ఏ టేబుల్ కు ఎవరిని కేటాయించామనే విషయం కౌంటింగ్ రోజు ఉదయమే ర్యాండమైజేషన్ ద్వారా తెలియచేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రం దగ్గర ఈవీఎంలకు సంబంధించిన బెల్ కంపెనీ ఇంజనీర్లు కూడా అందుబాటులో ఉంటారన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎం యంత్రాలను కలెక్టరేట్లోని ఈవీఎం గోడౌన్స్ కు చేర్చడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజున కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు ఇతర ఎన్నికల సిబ్బంది ఖచ్చితంగా ఐడెంటి కార్డులు తీసుకొనేరావాలన్నారు.కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎవరు కూడా కౌంటింగ్ హాల్ లోనికి మొబైల్ ఫోన్స్ తీసుకొని రాకూడదని, ఒకవేళ తీసుకుని వస్తే వాటిని మొబైల్ డిపాజిట్ సెంటర్లో డిపాజిట్ చేసి కౌంటింగ్ హాల్ లోకి రావాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు.

## జూన్ 10 న సిద్దేశ్వరం అలుగు 8 వ వార్షికోత్సవం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 31-మరికొద్ది రోజుల్లో నూతన ప్రభుత్వం ఏర్పడబోతున్న సందర్భంగా రాయలసీమ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై రాయలసీమ ప్రజా సంఘాల ప్రతి నిధుల సమావేశం రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రధాన కార్యాలయం నంద్యాలలో శుక్రవారం నాడు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు . రాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాల్లో అవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం రాయలసీమ అభివృద్ధికి అనేక హక్కులను కల్పించినప్పటికీ వాటి అమల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయని బొజ్జా దశరథరామిరెడ్డి ఈ సందర్భంగా విమర్శించారు.కానీ గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న పాలకులు ఈ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించి గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగంగ, వెలుగొండ ప్రాజెక్టుల భవిష్యత్తును గాలికి వదిలేశారు అని తీవ్రంగా విమర్శించారు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులకు నిధుల మళ్లింపుతో తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం ముందుకు సాగడం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమ ప్రాజెక్టుల నిర్వహణకు కూడా సరిగా నిధులు కేటాయించక పోవడంతో రాయలసీమలో నికర జలాలపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## కామ గాని గుండ్ల బాలు ను పరామర్శించిన సుబ్బారెడ్డి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 31డోన్ మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు మరియు యూనిట్ ఇంచార్జ్ కామగానిగుండ్ల బాలు కి ''హార్ట్ ఆపరేషన్'' అయినకారణంగాశనివారం హైదరాబాద్ లోని కామినేని హాస్పిటల్ నందు ఆయన ఆరోగ్య పరిస్థితిని పరామర్శించిన తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్ లు పరామర్శించారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190